నమస్తే తెలంగాణ

ఓటు పదిలం

విముక్త తెలంగాణ మరోసారి మూల మలుపులో నిలిచింది. పునర్నిర్మాణ ప్రక్రియ ఊపందుకున్న నేపథ్యంలో జరుగుతున్న కీలక ఎన్నికలివి. మూడో శాసనసభకు ఎవరిని పంపాలో, ఎవరిని ఇంటికి పంపాలో ఓటరు తీర్పు చెప్పే ప్రజాస్వామ్య పర్వదినం నేడు. అభివృద్ధిలో అంగలు వేస్తున్న యువరాష్ట్రం పరిపాలన పగ్గాలు ఎవరి చేతికి వ్వాలో నిర్ణయించే ముహూర్తం రానే వచ్చింది. ఈ రోజు తీర్పుతో తెలంగాణ భవితవ్యం ముడిపడి ఉంది. మరో ఐదేండ్లపాటు మన ప్రస్థానం ఎటువైపు, ఎలా సాగాలో తేల్చుకునే తరుణమిది. తెలంగాణకు మిత్రులెవరో, శత్రువులెవరో సూటిగా, ధాటిగా చెప్పుకోవాల్సి ఉంది. ఊగిసలాటకు లోనుకాకుండా, మాయోపాయాల ప్రచార పటాటోపాలను నిగ్గుదేల్చాల్సి ఉంది. బరిగీసి కొట్లాడి సాధించుకున్న తెలంగాణను 'మేం ఇచ్చామనే' దురహంకార పూరితమైన ధోరణిని ఎండగట్టాల్సిన అవసరముందని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఎవరు ఏమిటో ప్రజలకు తెలుసు. కానీ గందరగోళపర్చి ఓటును లాగేసుకోవాలనే కుట్రలు జోరుగానే సాగడం మనం చూస్తున్నాం. అమలు చేయలేని హామీలతో ఊరించే వాళ్లు, పసలేని విమర్శలతో పబ్బం గడుపుకోవాలని చూసేవాళ్లు పొంచి చూస్తున్నారు. తొణకకుండా, బెణకకుండా, ఓటుచేజారకుండా చూసుకోవాల్సి ఉంది. మంచిని గెలిపించాల్సి ఉంది.

రాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే సమున్నతంగా నిలబెట్టిన బీఆర్ఎస్ ఓ వైపు, ఉద్యమాన్ని ఆగం చేసినవాళ్లు, పచ్చబడ్డ తెలంగాణపై పట్టుకోసం అర్రులు చాస్తున్నవాళ్లు మరోవైపు నిలిచారు. చేసిన పనిని చూసి, అభివృద్ధిని చూసి ఓటేయమని ముఖ్యమంత్రి కేసీఆర్ మనవి చేశారు. విపక్షాల విష ప్రచారాలు నమ్మొద్దని హితవు చెప్పారు. మోసపోతే గోస పడుతమని పదేపదే గుర్తుచేశారు. ఇది ఆయనలోని ఆత్మవిశ్వాసానికి అద్దం పడుతున్నది. తెలంగాణ కోసం కొట్లాడిన తెగువ, ప్రగతిపథంలో నడిపించిన పరిపాలనా సామర్థ్యం చరిత్ర మరువని సత్యం. అవార్డులు, రివార్డులతో సాగిన అద్వితీయ పాలన దేశానికే దారిదీపమైంది. సకలజనుల సంక్షేమం, సర్వతోముఖాభివృద్ధి రెండు కండ్లుగా సాగిన పరిపాలన ఫలాలు మన కండ్లముందే ఉన్నాయి. ఈ ప్రగతి ప్రస్థానాన్ని గెలిపించాల్సి ఉంది.

అవతలివాళ్లు కేవలం ప్రభుత్వాన్ని దింపడం అనే నకారాత్మక ప్రచారంతో ముందుకువచ్చారు. కూల్చేస్తాం, పేల్చేస్తామంటూ వీరంగాలు వేశారు. ప్రగతి రథచక్రాలను వెనుకకు తిప్పుతామనే తిరోగమనవాదం వారి వేదమైంది. బురదజల్లుడు, బూటకపు ప్రచారాలతో హోరెత్తించారు. వీళ్లలో ఎవరు ఎక్కడ ఉండాలో ఓటర్లు నేడు చెప్పబోతున్నారు. పార్టీలు కాదు, ప్రజలు గెలిచే ఎన్నికలు కావాలని సీఎం కేసీఆర్ ఎప్పుడూ అంటుంటారు. ఒకరకంగా ఇవి అలాంటి ఎన్నికలే. ఓటరు ప్రలోభాలకు గురికాకుండా, పక్కదారి పట్టకుండా అన్నీ ఆలోచించుకొని తీర్పు చెప్పాల్సి ఉంది. తెలంగాణను మరోసారి గెలిపించాల్సి ఉంది.

వలసవాదుల ఏజెంట్లున్నారు జాగ్రత్త!

నారదాసు లక్ష్మణ్‌రావు

మనుషులను ప్రేమించడం మానవత్వం. మట్టిని ప్రేమించడం మహోన్నత తత్వం. తెలంగాణ జీవితాలను లోతుగా అధ్యయనం చేస్తే.. మట్టిని ప్రేమిస్తూ, మనుషుల కోసం పరితపిస్తూ, నవీన సమాజ నిర్మాణం కోసం, మానవీయ విలువల ఆవిష్కరణల కోసం, ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగధనుల వారసత్వాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగే వీరులు ప్రతి తరంలోనూ మనకు కనిపిస్తారు.

జీవన సంఘర్షణల్లోంచి మొలకెత్తి, మొగ్గ తొడిగిన వేలాది భావాలకు కార్యాచరణను ఇచ్చి, ఆయా కాలాల్లో సాగించిన పోరాటాల స్ఫూర్తి, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా సాగించే ఉద్యమాలకు చోదకశక్తిగా పనిచేస్తున్నది. నాటి తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు సాగిన పోరు బిడ్డల త్యాగాలకు గల కారణం ఒక్కటే! నేలతల్లి విముక్తి కోసం కనే కల సాకారం కావాలని, పర పీడన లేని స్వయం పాలన సాధించాలని, ఆత్మగౌరవ పెనుగులాటలో అంతిమ విజయం సాధించాలని.

ఆత్మగౌరవ, అస్తిత్వ పెనుగులాటల్లోంచి ఉద్యమ ప్రభంజనమై ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మహోన్నత ఉద్యమ కెరటం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. 2001 నుంచి దశాబ్దకాలంగా కొనసాగిన మలిదశ తెలంగాణ ఉద్యమంలో నెలకొన్న స్తబ్దతను తొలగించి, క్రియాశీలరూపంగా మార్చడానికి తీసుకున్న త్యాగపూరిత, భావోద్వేగ నిర్ణయమే... 'తెలంగాణ వచ్చుడో-కేసీఆర్ సచ్చుడో'. 'తెలంగాణ జైత్రయాత్రనా, కేసీఆర్ శవయాత్రనా?' ఏదో ఒక్కటి తేలిపోవాలనీ, చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవడం.

ఇదంతా ఒకెత్తయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వెంటనే జరిగిన ఎన్నికల్లో, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న సొంత రాష్ట్రంలో ఇంటి పార్టీగా భావించిన టీఆర్ఎస్ అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయతీరాలకు చేర్చిన కేసీఆరే నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలనీ తెలంగాణ సమాజమంతా కోరుకున్నది. అధికారాన్ని బాధ్యతగా, ప్రజలకు సేవ చేసే సాధనంగా భావించిన ప్రజలిచ్చిన అధికారాన్ని ప్రజల కోసం వినియోగిస్తూ, ప్రజల నుంచి వచ్చిన డబ్బును (ఆదాయాన్ని) ప్రజల కోసం ఖర్చుచేస్తూ సంపద పెంచుతూ, ప్రజలకు పంచుతూ, ప్రజలే కేంద్రంగా ప్రజా సమస్యలే ఇతివృత్తంగా, అత్యంత పారదర్శకంగా పరిపాలన సాగించారు కేసీఆర్. పల్లెల నుంచి పట్టణాల వరకు, ఇరిగేషన్ నుంచి ఇంటర్నెట్ వరకు, సమగ్ర సమీకృత, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధిని సాధిస్తూ, దశాబ్ద కాలంలోనే శతాబ్ది అభివృద్ధిని సాధించిన ఘనత, నిబద్ధత కేసీఆర్‌ది.

ఇదంతా అభివృద్ధికి సంబంధించినది. అయితే, తెలంగాణకు ఇప్పటికింకా సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించలేదు. ఎప్పుడూ ఎవరో ఒకరి ఆధీనంలో పరాధీనంగా ఉండిపోతున్నది. తెలంగాణకు, వలసవాదులకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉన్నది. వలసవాదుల అవశేషాలు ఇంకా మిగిలే ఉన్నాయి. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్న రెండు జాతీయ పార్టీలు రాష్ట్ర నాయకత్వాల రూపంలో సీమాంధ్రుల రహస్య ఆధిపత్య ఎజెండాల రచనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించి తెలంగాణ సమాజమంతా ఇప్పుడొక నిర్ణయాత్మకమైన ఆలోచన చేయాలి. ఈ ఎన్నికలే రేపటి అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, సుస్థిరతను, ప్రశాంతతను, భవిష్యత్తు అభివృద్ధిని నిర్ణయించబోయేటివి. వీటిని ఎప్పటిలా జరుగుతున్న సాధారణ ఎన్నికలుగా భావించవద్దు. తెలంగాణ ఏర్పడ్డాక జరుగుతున్న ఈ మూడోసారి ఎన్నికలు చరిత్రాత్మకమైనవి. దశాబ్దాల గాయాల గత అవశేషాలను మార్చబోయేవి. వేలాది యువకుల రక్త తర్పణంతో ఏర్పడ్డ తెలంగాణ సుస్థిర భవిష్యత్తును సాధించే ఎన్నికలు. ఎందుకంటే నిజాం పాలనకు, వారి తాబేదార్లయిన భూస్వాములు, జాగీర్దారులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం చేసిన తర్వాత విముక్తిని పొందినా, సమైక్యం పేరుతో మన స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను కోల్పోయిన పిదప, మళ్లీ మన సొంత రాష్ట్రాన్ని పొందడానికి 60 ఏండ్ల కాలం పట్టింది. ఎన్నో ఉద్యమాలు చేశాం. వేలాది యువకులను దూరం చేసుకున్నాం. అన్నింటికి మించి ఎంతో జీవన విధ్వంసాన్ని అనుభవించాం. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీల, రాష్ట్ర నాయకుల మాటలు, కేంద్ర నాయకుల మాటలు, ప్రకటనల రూపంలో తెలంగాణ వ్యతిరేకుల (వలసవాదుల) రహస్య ఆధిపత్య ఎజెండాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదంతా కండ్లారా చూస్తూ కూడా వలసవాదుల ఏజెంట్లకే అధికారాన్ని కట్టబెట్టడమా? తెలంగాణలో విధ్వంసమే జరుగలేదంటున్న నేతలకు పునర్నిర్మాణం గురించి ఎలా తెలుస్తుంది? తెలంగాణలోని అణువణువూ ఏదో ఒకవిధంగా గాయపడి ఉన్నది. అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిన పార్టీలు అధికారం కోసం మతాన్ని అడ్డుపెట్టుకుంటున్న పార్టీలు, తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించి మన యువకుల బలిదానాలకు బాధ్యులైన పార్టీలు వీటన్నింటి స్వరూప, స్వభావాలను మనం గమనించి ఉన్నాం. అయినా వీరికే అధికారం కట్టబెడుదామా? లేక తెలంగాణ కోసమే

పురుడు పోసుకొని, తెలంగాణ సాధనే ఊపిరిగా చేసుకొని, 10 జిల్లాల ప్రజలను ప్రబల శక్తిగా మలచి, కాలపరీక్షకు నిలవాల్సి వచ్చినప్పుడల్లా పదవీ త్యాగాలకు సిద్ధపడి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, సాధించిన రాష్ట్రంతో, స్థిరమైన రాజకీయ నాయకత్వాన్ని, సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తూ, శాంతిభద్రతలను కాపాడుతూ, మత సామరస్యాన్ని పెంపొందిస్తూ, ప్రశాంత పరిపాలనను అందిస్తూ తెలంగాణ రక్షకుడిగా, సంరక్షకుడిగా ఉన్న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మళ్లీ అధికార పీఠంపై కూర్చోబెడదామా? అన్నది ప్రజలు మెలకువతో ఆలోచించాల్సిన ఒక మౌలిక ప్రశ్న.

బీఆర్ఎస్‌కే ఓటు ఎందుకు వేయాలి? కేసీఆర్ నాయకత్వాన్నే ఎందుకు బలపర్చాలి? అందుకు సవాలక్ష సహేతుకమైన కారణాలున్నాయి? అమెరికా అణుబాంబు దాడిలో సర్వనాశనమైన జర్మన్, జపాన్ దేశాలు, అనతికాలంలోనే ప్రపంచం నివ్వెరపోయే ఆర్థికాభివృద్ధిని సాధించిన ఘనత అంకితభావంతో పనిచేసిన అక్కడి నాయకత్వానికి దక్కుతుంది. తెలంగాణ సత్వరాభివృద్ధికి కూడా అలాంటి నాయకులు కావాలి. తల తెగిపడినా తెలంగాణ తప్ప మరో పదం ఉచ్చరించని కేసీఆర్‌కు మాత్రమే అది సాధ్యం.

ఇప్పుడు తెలంగాణ 'ఇచ్చింది మేమే' అని, 'తెచ్చింది మేమే'నని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మరి ఇచ్చింది వాళ్లయితే పోగొట్టింది ఎవరో ప్రజలు ఆలోచించాలి. 60 ఏండ్లు అరిగోస పెట్టుకున్నదెవరు? వేలాది యువకుల ఆత్మబలిదానాలకు కారకులెవరు? ఏ పరిస్థితుల్లో ఇచ్చింది? ఏ సమయంలో ఇచ్చింది? ఇచ్చిందా?, ఇవ్వవలసి వచ్చిందా? అంటే ఇవ్వవలసి వచ్చిందనే సమాధానం తెలంగాణ సమాజం అంతా చెప్తుంది. ఆ అనివార్యతను సృష్టించింది కేసీఆర్, తెలంగాణ ఉద్యమం.

ఎన్నికల సమయంలో తెరమీదికి వచ్చి, ఎన్నెన్నో కబుర్లు చెప్పే నాయకులకు, తెలంగాణ ఆత్మను స్పృశించే అవగాహన కానీ, అర్హత కానీ ఎక్కడ ఉంది? పద్నాలుగేండ్లు ఉద్యమంలో కలియదిరుగుతూ, గుండె గుండెలో గూడుకట్టుకున్న విషాదాన్ని కండ్లారా చూసినవాడు కేసీఆర్. భౌగోళికంగా ఉన్న సమస్యలతో పాటు, సామాజిక సమస్యలను సంపూర్ణంగా అవగాహన చేసుకున్నవాడు. భాషా సంస్కృతుల, చారిత్రక విశిష్టతలను ఔపోసన పట్టినవాడు. తెలంగాణ గడ్డనేలిన శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల పరిపాలనలో తెలంగాణలో జరిగిన వికాసాన్ని, విధ్వంసాన్ని భవిష్యత్తు రూపకల్పన నేపథ్యంలో అధ్యయనం చేసినవాడు కేసీఆర్. జన్మనిచ్చిన బిడ్డ సంరక్షణ కోసం, ఎదుగుదల కోసం ఒక తల్లి ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది, ఎన్ని త్యాగాలకు ఓర్చుకుంటుందో, అలాగ తన చేతుల్లో పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర వికాసానికైనా, వినిర్మాణానికైనా, తన జీవితాన్ని అంకితం చేసే అవకాశం ఇప్పుడు ఒక్క కేసీఆర్‌కే ఉంది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని, మన కలల తెలంగాణ నిర్మించాలంటే, అందుకు కావలసిన అధికారాన్ని మళ్లీ కట్టబెట్టే బాధ్యత ప్రతి తెలంగాణ వాదిపై, ప్రతి తెలంగాణ పౌరునిపై ఉంది. చేసింది చాలా ఉంది, చేయాల్సిందింకా ఉంది.

బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత ఎన్నికల మ్యానిఫెస్టో పీపుల్స్ మ్యానిఫెస్టోగా ప్రశంసలందుకుంటున్నది. తెలంగాణ భౌతిక వికాసం, మానవీయ విలువలు, అంతస్స్రోతంగా కలిగిన అభివృద్ధి మ్యానిఫెస్టో ఇది. వలసవాదుల అవశేషాలను, కుట్రలను కూల్చాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే అన్నివర్గాల ప్రజలు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకొని మీ అమూల్యమైన తీర్పును ఇవ్వండి. తెలంగాణకు రక్షణ కవచంగా నిలబడండి.

ఏది సత్యం, ఏది అసత్యం?

రమేశ్ హజారి
93909 19090

వలస పాలన నుంచి స్వపాలన దాకా తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ ప్రాణానికి ఎదురొడ్డి చేసిన త్యాగాలను, భరించిన అవమానాలను, దుర్మార్గమైన విమర్శలను తలచుకుంటే హృదయమున్న ఎవరికైనా కన్నీరు తన్నుకరాక మానదు.

త్యాగాలతో దశాబ్దాల కాలం కరిగిపోంగ, వలస పాలనలో పరాయీకరణకు గురై, ఏదీ నాది కాదనే నిరాశా నిస్పృహలతో రాజకీయ నిర్వీర్యతకు గురైంది తెలంగాణ. అటువంటి సంధికాలంలో ముందటికి వచ్చింది 'కేసీయారిజం' అనే ఒక రాజకీయ పంథా. అప్పటిదాకా మెయిన్ స్ట్రీం పాలిటిక్స్‌లో అణచివేయబడి గుండె గొంతుకలో కొట్లాడుతున్న తెలంగాణ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అస్తిత్వ భావనను పెకిలించి శంఖారావం పూరించి, వేయి గొంతుకల ప్రకటన చేసిన రణనినాదం వినిపించిండు కేసీఆర్.

నాడు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ మహాత్ముని బాటలో నడిచి, శాంతియుత పద్ధతుల్లో తెలంగాణను నడిపించి స్వయం పాలన సాగించిండు. ఉద్యమం చేస్తూనే ఒక పక్క ఇంటిపోరు, మరోపక్క బయటిపోరును తట్టుకొని నిలబడటం సామాన్యులతో అయ్యేపని కాదు. కానీ కేసీఆర్‌కు సాధ్యమైంది. ఈ తన్లాట స్వరాష్ట్రంలో కూడా వెన్నంటింది. ఆరంభంలోనే స్వయం పాలనను కూలదోయడానికి విఫల ప్రయత్నం చేసిన తెలంగాణ ద్రోహుల గుంపు తమ కుట్రలకు, కుతంత్రాలకు పదునుపెడుతూ.. తమ స్వార్థ రాజకీయాల కోసం ఏకమై గుంటనక్కల మాదిరి మోపైండ్రు. ద్రోహులకు సద్దులు మోసే తెలంగాణ ఇంటి దొంగలు కేసీఆర్‌ను పడగొట్టాలని గుంటనక్క పన్నాగాలను తలచుకుంటే తెలంగాణ హృదయాలు నేటికీ తల్లడిల్లుతున్నాయి. గాలి వార్తలను సృష్టించి అమాయకపు తెలంగాణ ప్రజలను గోల్మాల్ తప్పి అధికారం గద్దెనెక్కుదాం అని ఆత్రపడుతున్న విద్వేష వాదులకు భంగపాటు తప్పదు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను తెర్లు గాకుంట కాపాడుతున్న కేసీఆర్ పట్టుదలను భగ్నం చేయాలని చూస్తున్న ఈ బానిస తొత్తులకు నవంబర్ 30 నాడు తమ ఓటుతో బుద్ధిచెప్పాలని తెలంగాణ సమాజం నిశ్చయించుకున్నది. కేసీఆర్ చేసే ప్రతి పనినీ తప్పుపడుతూ, ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తూ, గుంపులు గుంపులుగా మీడియా మాధ్యమాల ద్వారా గుప్పుతున్న అబద్ధాలను, అర్ధ సత్యాలను పసిగట్టి తిప్పకొట్టేందుకు సిద్ధంగా ఉంది తెలంగాణ. సోషల్ మీడియా పేరుతో నడుపుతున్న గోబెల్స్ ప్రచారాన్ని తెలంగాణ సోయితో అర్థం చేసుకుంటూ ఏది సత్యం.. ఏది అసత్యమో తెలుసుకుంటున్నరు.

తెలంగాణ ప్రగతి ప్రస్థానం మరింతగా పురోగమించాలంటే.. మరింత రాజకీయ పాలన స్థిరత్వం అనివార్యం. అందుకే ఈ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం. కేసీఆర్‌నే మళ్లా ముఖ్యమంత్రిని చేసుకుంటం అంటున్నారు ప్రజలు. ఇందులో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. 'మేము రాజకీయ జ్ఞానానికి వచ్చినం.. ఓ మహాత్మా.. ఓ మహర్షీ మీ బాటే సత్యం, మీ మాటే నిత్యం.. మీ అడుగుజాడల్లోనే నడుస్తం' అంటున్నది యావత్ తెలంగాణ సమాజం.

రైతుల నోట్లో మన్ను

ఆలేటి రమేష్
9948798982

బీఆర్ఎస్ ప్రభుత్వం నిస్సందేహంగా రైతు ప్రభుత్వమే. అన్నదాతకు తెలంగాణ ప్రభుత్వం పంట సహాయం కోసం ఏర్పాటుచేసిన రైతు బంధు పథకం డబ్బులు పడకుండా కాంగ్రెస్ కుట్రలు పన్నింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల్లోంచి పుట్టిన రైతుబంధు పథకంలో దళారులు లేరు. నేరుగా రైతు ఖాతాల్లోనే పంటసాయం డబ్బు జమవుతుంది. పైరవీలు లేవు. దరఖాస్తులు లేవు.

రైతులందరికీ ఏకరీతిన పంట సాయం అందుతుంది. ఈ విధంగా రైతును అక్కున జేర్చుకున్న రాష్ట్రం దేశంలో ఎక్కడా లేదు. రైతాంగాన్ని ఇంతగా కడుపులో దాచుకున్న సర్కారు స్వతంత్ర భారత చరిత్రలో మరొకటి లేదు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఇలా రైతాంగానికి బీఆరెస్ సర్కారు దగ్గర కావడం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, అధికారం కోసం తపిస్తున్న కాంగ్రెస్‌కు కంటగింపుగా మారిపోయింది. జనం సమస్యలు పక్కన బెట్టి రాజకీయాలు చేసే ఈ పార్టీలకు తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెప్పే రోజు వచ్చింది.

రైతుబంధు ద్వారా ఏటా రెండు సార్లు 63 లక్షల మంది రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా అందిన పెట్టుబడి సాయం రైతు బంధు, సాగునీటిప్రాజెక్టులు, 24 గంటల కరెంటు, మద్దతుధర రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అత్యంత లాభదాయకంగా మార్చాయి. రాష్ట్రంలో వ్యవసాయం చేసేవారి సంఖ్య పెరిగింది. సీఎం కేసీఆర్ మానసపుత్రిక రైతుబంధు ద్వారా అన్నదాతలకు అందిస్తున్న పంట పెట్టుబడి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతును రాజును చేసింది. నవతరాన్ని సైతం సాగువైపు మళ్లించేలా స్ఫూర్తినిచ్చింది రైతుబంధు. వ్యవసాయంలో స్వాతంత్ర్యానంతరం ఇంతటి సంస్కరణ రాలేదు.

> **దేశానికే మార్గదర్శకంగా రైతుబంధు పథకం. రైతు కోసం ఇంత మొత్తం వెచ్చించింది తెలంగాణే. సీఎం కేసీఆర్ మానస పుత్రిక రైతుబంధు ద్వారా అన్నదాతలకు అందిన వరం.**

దేశంలో తొలిసారిగా ప్రభుత్వమే పెట్టుబడి పెడుతూ,వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి,రైతును రాజును చేసి, నవతరాన్ని సైతం సాగువైపు మళ్లించేలా స్ఫూర్తి నిచ్చింది రైతుబంధు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు అండగా ఉండాలనే లక్ష్యంతో రైతు బంధు పథకం ద్వారా వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందిస్తుండడంతో పాటూ రైతు బీమా ద్వారా బాధిత కుటుంబాలకి భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతునేస్తంగా నిలుస్తున్నారు.

తేటకండ్ల చూపు

కన్నీరవుతున్న నిజాన్ని
కాఠిన్యమైన చేతులతో తుడిచేయలేను
వంగిన విల్లు లాంటి దేహపు
అల్లెతాడును అమాంతం తెంపేయలేను
వెలుతురును గడ్డివాములా పేర్చుకుంటున్నా ఇప్పడిప్పడే
చీకట్లో జారిపడలేను

పచ్చటి చేను చాటలో పసిపిల్లల్లా ఎగురుతున్నది
కలల్ని కల్లోలితం చేసుకోలేను
జాజుపూతల ఇంట్లోకి వచ్చిన బంధువుల్ని
ఎలా దూరం చేసుకోగలను

దూలానికి ఓ దిక్కు ఆకలితోని తొట్లెల పిల్లగాని ఏడుపు
ఇంకో దిక్కు ఉరితాడు నిత్తెము ఊగుతనే ఉండే
కన్నీళ్ళతోనే పెంచినం నలుసుల్ని
అసలు నీళ్ల జాడేది మునుపు

వలస కడుపుల ఆకల్ని ఒంటి చూపుతోనే
నెమరేసిన కాలాల్లోకి ప్రయాణించలేను
రెప్పల మీద రాత్రి వెన్నెల గీతల్ని తుడిచి
జాగారం ముడుపు కట్టుకున్న రోజుల్ని మర్చిపోలేను
ఎండిన చెరువు ముందు రాబందువుల నీడలో
కుమిలిన క్షణాల్లోకి జారిపోలేను
ఇప్పడు నేను మత్తడి ముందు నీటి
చుక్కల్లో స్నానం చేస్తున్న పాలపిట్టని
మట్టిలోకి అలవోకగా సాగిపోతున్న నాగలి కర్రును
మెహెందీ చేతులతోని దుఃఖపు ధారల్ని
తుడిచేసుకున్న అమ్మాయిని
మోతె బిందువుల్ని రాల్చేసుకొని
వృద్ధాప్యాన్ని కొయ్యకు తగిలించి
కొత్త చూపుతో ఈ మట్టిని
ముద్దాడుతున్న తరాన్ని మోసం చేయలేను

కటిక చీకట్ల విప్పని బాసింగంతోనే
పాలంల కరెంటు కోసం మూడు రాత్రులు గడిపిన
రోజుల్ని మళ్ళీ మళ్ళీ పలవరించలేను
పాములతో, తేళ్ళతో సహవాసం అక్కరలేదు

నేను ఇక్కడి మట్టిని
తెగించి కొట్లాడిన గౌరవ పతాకాన్ని

చూపుడు వేలుకు బంగారు కలల్ని చుట్టుకొని
రేపటి భద్రమైన బతుకులకు బాటలువేసిన
తేటకండ్ల తెలంగాణ ఆత్మని

వేముగంటి మురళి
96765 98465

బడుగుల అభివృద్ధి ప్రదాత

ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని జాతుల ప్రజలు అభివృద్ధి చెందితేనే ఆ దేశ ప్రజాస్వామ్యానికి పరిపూర్ణత వస్తుంది. అది విజయవంతం కావాలంటే పాలకులకు ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి ఉండాలి. తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటుతర్వాత బీసీల అభివృద్ధికి అంకురార్పణ జరిగింది. బీసీల సమస్యలు తెలిసిన కేసీఆర్ తెలంగాణకు ముఖ్యమంత్రి అయినాక బీసీల జీవన ప్రమాణాల్లో మార్పు చోటుచేసుకున్నది.

ఎంసీ చంద్రశేఖర్ ముదిరాజ్
96478 19999

2014, జూన్ 2న రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి బీజం పడింది. దశాబ్దాలుగా బీసీలు బలంగా కోరుకుంటున్న బీసీ రిజర్వేషన్ల పెంపు, బీసీ జనగణన, బీసీ మంత్రిత్వ శాఖల కోసం దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ బెదిరింపులకు వెరవకుండా అత్యంత బలంగా డిమాండ్ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరే. కేంద్రం పరిష్కరించాల్సిన అంశాలపై కొట్లాడుతూనే మూడున్నర కోట్ల రాష్ట్ర జనాభాలో మన వద్ద కూడా యాభై శాతానికి మించి బీసీ జనాభా ఉన్నదని సాధికారికంగా సకల జనుల సర్వే ద్వారా తేల్చారు. ఈ వెనుకబడిన వర్గాలను విద్య, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ప్రయత్నాలు సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ సారథ్యంలో చిత్తశుద్ధితో జరుగుతున్నాయి.

తెలంగాణ ఏర్పడేనాటికి అరకొర నిధులతో కేవలం 19 బీసీ గురుకులాలు పనిచేస్తుంటే, విద్య లేకపోతే జ్ఞానం రాదు, జ్ఞానం రాకపోతే బలహీన వర్గాల్లో చైతన్యం వెల్లివిరియదన్న మహాత్మా జ్యోతిబాపూలే మాటలను ఆదర్శంగా తీసుకొని, ఆ మహనీయుని పేరున బీసీ గురుకుల విద్యా సంస్థలను వజ్ర సంకల్పంతో ఏర్పాటుచేశారు కేసీఆర్. దీంతో బీసీ గురుకులాల 281కి పెరిగింది. పౌష్టికాహారం, సకల సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందుకుంటున్నారు. ఫలితంగా బీసీ విద్యార్థులు నీట్, ఐఐటీ వంటి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తూ దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఆటల్లో సైతం అదేస్థాయిలో రాణిస్తూ చాంపియన్లుగా అవతరిస్తున్నారు. అంతేకాదు, ఇండియన్ నేవీ, ఆర్మీలో సెలక్టయి దేశరక్షణలో భాగస్వాములవుతున్నారు. గురుకులాల్లో చదివిన మెరికల్లాంటి బీసీ బిడ్డలు రాష్ట్ర సగటు ఫలితాల్లో అగ్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విధంగా గడిచిన పదేండ్లలో బీసీల విద్యాభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చుచేసిన కేసీఆర్ సర్కార్‌కు ఆత్మగౌరవం విలువెంతో తెలుసు. అందుకే బీసీలు ఆత్మగౌరవంతో ఉన్ననాడే నిజమైన పాలన అందుతుందని నమ్మి హైదరాబాద్ మహానగరం నడిబొడ్డున దాదాపు రూ.6 వేల కోట్ల విలువ గల స్థలాలను బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల కోసం కేటాయించారు. ఇప్పటికే కొన్ని కులాల భవనాల నిర్మాణం పూర్తికాగా, మరికొన్ని భవనాల నిర్మాణం జరుగుతున్నది.

ఇట్లా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుడుతూనే.. బీసీల హక్కుల కోసం కేంద్రంపై పోరాడుతున్నది. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్ మొదటినుంచి డిమాండ్ చేస్తున్నారు. ఇక కులాలవారీగా జనగణన చేపట్టాలని బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని గట్టిగా అడుగుతున్నది. సావిత్రీబాయి, మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం కేసీఆర్ బహుజనులకు దిక్సూచిగా నిలుస్తున్నారు. అందుకే నేడు జరిగే ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసే బృహత్కార్యంలో మనమంతా భాగమవుదాం!

(వ్యాసకర్త: రాష్ట్ర లీగల్ అడ్వైజర్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ)

ముస్లింలంతా సారు వెంటే

45 ఏండ్లు తెలంగాణను పాలించింది కాంగ్రెస్ పార్టీ. అయినా ముస్లిం, మైనారిటీల బతుకులను బాగు చేయలేదు. కానీ తాజాగా ము